# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 91 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం • 24, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


### అక్టోబర్ 31న బ్యాంకులకు
## దీపావళి సెలవు

న్యూఢిల్లీ,అక్టోబర్ 23(నమస్తే ఉదయం): దీపావళి సహా వివిధ రాష్ట్రాల్లో ఇతర పండగలు జరగనున్న నేపథ్యంలో.. బ్యాంకులకు వరుస సెలవులు రాబోతున్నాయి. కొన్ని చోట్ల వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడుతో సహా అనేక రాష్ట్రాల్లో అక్టోబర్ 31న(గురువారం) దీపావళి జరుపుకుంటున్నారు. దీంతో ఆ రోజు ఈ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు. ఢిల్లీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అనేక రాష్ట్రాలు నవంబర్ 1న దీపావళి జరుపుకుంటున్నాయి. ఆయా రాష్ట్రాల్లో శుక్రవారం సెలవు ప్రకటించారు. బ్యాంకులకు వెళ్లాలనుకుంటున్న వారు ఈ విషయాన్ని గమనించగలరు. ఇక విద్యా సంస్థలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం5 రోజులు సెలవులు ప్రకటించగా.. తమిళనాడు సర్కార్ అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీలను సెలవులుగా నిర్ణయించింది.




### వయనాడ్ ప్రజలు
# తన కుటుంబ సభ్యులే

- వారికి సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చా
- రాజకీయాల కోసం ఇక్కడి రాలేదు
- వయనాడ్ ర్యాలీలో ప్రియాంక వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో నామినేషన దాఖలు
- తనలాగే చెల్లిని ఆదరించాలని రాహుల్ పిలుపు
- కార్యక్రమంలో పాల్గొన్న సోనియా, ఖర్గే, రేవంత్, భట్టి






తిరువనంతపురం,అక్టోబర్23(నమస్తే ఉదయం): వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులతో సమానమని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నిక నేథ్యంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రియాంక గాంధీ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించిన ప్రియాంక గాంధీ, అనంతరం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన కొత్త ప్రయాణాన్ని వయనాడ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల కోసం ఇక్కడకు రాలేదని, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వయనాడ్ వచ్చినట్లు తెలిపారు. రాజకీయానికంటే ఈ దేశం ముఖ్యమన్నారు. సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగారని, ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, వారి సమస్యలను తెలుసు కునేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించినట్లు చెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా ఉండేందుకు తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలతో కలిసి పోరాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి వయనాడ్‌కు వచ్చినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రాహుల్ మాట్లాడుతూ..తనకులాగే వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంకగాంధీని ఆశీర్వదించాలన్నారు. వయనాడ్ నుంచి అధికారికంగా ఒకరు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తే.. మరొకరు అనధికారికంగా వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఇక్కడి ప్రజల కోసం తాను ఎప్పటికీ పోరాడుతూనే ఉంటాన్నారు. తన తల్లి ఇక్కడ ఉన్నారని, తండ్రి చనిపోయిన తర్వాత తన సోదరి ప్రియాంక గాంధీ అమ్మను చూసుకుంటున్నార్నారు. ప్రియాంక 17 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పో యిందని, అయినప్పటికీ తమ తల్లికి తోడుగా నిలిచిందని

మిగతా.. 2లో



## ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి సహా 10 అంశాల్లో చర్యలు
- ప్రధాన నేతలకు షాక్ తప్పదు పూర్తి ఆధారాలతో ఫైళ్లు సిద్ధం
- తప్పు చేసింది ఎవరైనా విడిచిపెట్టం
- దక్షిణ కొరియాలో రెవెన్యూ మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబరు 23(నమస్తే ఉదయం): దీపావళికి ముందే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయ బాంబు పేల్చారు. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో హాన్ నది పునరుజ్జీవనంపై అధ్యయనానికి వెళ్లిన పొంగులేటి అక్కడ ఓ తెలుగు చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలబోతున్నాయని.. ప్రధాన నేతలకు పెద్ద షాక్ ఇవ్వబోతున్నట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి వంటి సుమారు 8 నుంచి 10 ప్రధాన అంశాల్లో చర్యలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించి అన్ని సాక్ష్యాధారాలతో ఫైళ్లు కూడా సిద్ధం చేశామని తెలిపారు.

మిగతా.. 2లో

### సరిహద్దు గస్తీ ఇరు దేశాల మధ్య
## ముందడుగు

- బ్రిక్స్ సదస్సులో భారత్, చైనా చర్చలు
- జిన్‌పింగ్‌తో ప్రధాని మోడీ చర్చలు

మాస్కో,అక్టోబర్ 23(నమస్తే ఉదయం): రష్యాలోని కజన్‌లో జరుగుతోన్న బ్రిక్స్ దేశాల 16వ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. సరిహద్దు గస్తీపై జరిగిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..

మిగతా.. 2లో




### పాక్‌తో సయోధ్యకు
## కృషి చేయాల్సిందే

- కాశ్మీర్ శాంతికి అదే మార్గం
- మళ్లీ పాతపాట పాడిన మెహబూబా ముఫ్తీ

శ్రీనగర్,అక్టోబర్ 23(నమస్తే ఉదయం): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, రక్తపాతంపై పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ పాత పల్లవే అందుకున్నారు. ఉగ్రవాదం, రక్తపాతానికి తెరపడాలంటే భారత్, పాక్ మధ్య సయోధ్య ఒక్కటే ఏకైక మార్గమని అన్నారు. అక్టోబర్ 20న గందేర్‌బల్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ షానవాజ్ దర్ నివాసానికి మెహబూబా ముఫ్తీ బుధవారంనాడు వెళ్లారు.

మిగతా.. 2లో





### గంగారెడ్డి హత్యపై
## ప్రభుత్వం సీరియస్

- చేసిని వారిని..చేయించిన వారినీ వదలబోం
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

హైదరాబాద్,అక్టోబర్23 (నమస్తే ఉదయం): జగిత్యాలలో కాంగ్రెస్ నేత గంగారెడ్డి హత్యపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, దోషులను వదిలేది లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మర్డర్ ఎవరు చేసినా.. ఎవరు చేయించినా వదిలేది లేదని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీతో ఇప్పటికే మాట్లాడటం జరిగిందని తెలిపారు.జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడి హత్య, ఆ తరువాత జరిగిన పరిణామాలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. జీవన్ రెడ్డితో ఇప్పటికే పీసీసీ చీఫ్ మాట్లాడారని తెలిపారు. జీవన్ రెడ్డితో నేను కూడా మాట్లాడుతా అని మంత్రి చెప్పారు. జీవన్ రెడ్డి పార్టీలో అత్యంత సీనియర్ నేత అని... ఆయన సేవలను తాము వినియోగించుకుంటామన్నారు. పార్టీలో జీవన్ రెడ్డి గౌరవానికి భంగం కలిగించమని వెల్లడించారు.

మిగతా.. 2లో

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కి
## కేటీఆర్ లీగల్ నోటీసు!



- తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని నోటీసులో పేర్కొన్న కేటీఆర్
- వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరిక

హైదరాబాద్, (నమస్తే ఉదయం): కేంద్ర మంత్రి, భారతీయ జనతా పార్టీ(బీజేపీ) ఎంపీ బండి సంజయ్ తనపై నిరాధారమైన, తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశా రంటూ ఆయనకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని

మిగతా.. 2లో

### నీ తాటాకు చప్పుళ్లకు
## భయపడే వాళ్లం కాదు

- నోటీసులకు నోటీసులతోనే సమాధానం ఇస్తున్నా
- నువ్వెంత సుద్దపూసో ..ప్రజలకు తెలుసు
- కెటిఆర్ నోటీసులపై బండి సంజయ్ ఘాటు సమాధానం




హైదరాబాద్,అక్టోబర్23(నమస్తే ఉదయం): లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు

మిగతా.. 2లో

### 28 నుంచి నవంబర్ 13 వరకూ
## బీసీ కులగణన

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు వెల్లడి




హైదరాబాద్,అక్టోబర్ 23(నమస్తే ఉదయం): తెలంగాణలో అక్టోబర్ 28 నుంచి నవంబర్ 13 వరకూ బీసీ కులగణన చేపట్టనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. ఈనెల 28నుంచి అధికారుల ఇళ్లకు వస్తారని, వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను సూచించారు. కులగణన జరగాలని చెప్పిన ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని, గణన జరిగితే వెనకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన ఎప్పుడో చెప్పాలని మాజీ ఎంపీ అన్నారు. రైతులు, విద్యార్థులు ఇలా అందరి సమస్యలు తెలిసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ..'కులగణన చేసేందుకు గ్రామాలకు, మండలాలకు అధికారులు వస్తారు. ప్రజలు వివరాలు ఇచ్చి సహకరించాలి. బీసీ కులగణన జరిగితే వారి జనాభా ఎంతో తెలుస్తుంది. ఎస్సీ, ఎస్టీలు అందరూ వారి జనాభా తెలియాలని అడుగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన తెలంగాణలో మొదలుపెట్టారు.గతంలో మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ

మిగతా.. 2లో

### డ్యామ్ సేఫ్టీపై
## కమిషన్ ప్రశ్నల వర్షం

- కాళేశ్వరంపై కొనసాగిన విచారణ
- కమిషన్ ముందుకు ఈఎన్‌సీ నాగేందర్

హైదరాబాద్,అక్టోబర్23(నమస్తే ఉదయం): కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కొనసాగుతోంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ ఈఎన్‌సీ నాగేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేందర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా



ప్రశ్నలు వేసినట్లు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో

మిగతా.. 2లో



### మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన
## పరువు నష్టం కేసులో కేటీఆర్ వాంగ్మూలం!

- ఆమె వ్యాఖ్యలు నాతో పాటు పార్టీకి నష్టం కలిగించాయి
- పబ్లిసిటీ కోసమే దిగజారుడు ఆరోపణలు
- 30న మిగతా సాక్షుల వాంగ్మూలం రికార్డ్

హైదరాబాద్, (నమస్తే ఉదయం): మంత్రి కొండా సురేఖ పై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో నాంపల్లి కోర్టులో బుధవారం కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చారు. కొండా సురేఖ వ్యాఖ్యలు తనతో పాటు పార్టీకి కూడా

మిగతా.. 2లో

## మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన
# పరువు నష్టం కేసులో కేటీఆర్ వాంగ్మూలం!

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని కోర్టులో కేటీఆర్ స్టేట్ మెంట్ ఇచ్చారు. తనపై కొండా సురేఖ చేసిన కామెంట్లను చూసి సాక్షులు తనకు ఫోన్ చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నా యని వాటిని విని షాక్ గురయ్యానని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షులు తనకు 18 ఏళ్లుగా తెలుసని వారు కూడా ఈ వ్యాఖ్యలు విని చాలా బాధపడ్డారని చెప్పారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను కొండా సురేఖ చేశారని కేటీఆర్ తన వాంగ్మూలంలో తెలిపారు. ఆమె మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా తీవ్ర ఆవేదన కలిగించేలా ఉన్నాయని కోర్టుకు చెప్పారు. నేను డ్రగ్ అడిక్ట్ అని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానని ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పబ్లిసిటీ కోసమే కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు అన్ని చెప్పలేకపోతున్నానని ఫిర్యాదులో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కేటీఆర్ కోర్టును కోరారు. దాదాపు అరగంట పాటు కోర్టులో కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు.

కొండా సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. కేటీఆర్ తో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్ స్టేట్ మెంట్ ను కూడా కోర్టు నమోదు చేసుకుంది. మిగతా సాక్షుల స్టేట్ మెంట్లను రికార్డ్ ను కోర్టు ఈ నెల 30 కి వాయిదా వేసింది.

గతంలోనూ కేటీఆర్‌పై కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పుడు ఎన్నికల సంఘం ఆమె తీరుపై మండిపడింది. అయినప్పటికీ కొండా సురేఖ తీరులో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ అవే ఆరోపణలు చేయటంతో బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ ఆమెకు లీగల్ నోటీసులు ఇచ్చారు. మంత్రి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసును కేటీఆర్ ఫైల్ చేశారు.

ఈ నెల 21నే స్టేట్ మెంట్ రికార్డ్ చేయాల్సి ఉన్నప్పటికీ కేటీఆర్ అభ్యర్థన మేరకు గురువారం వరకు కోర్టు సమయమిచ్చింది. ఇవ్వాళ మధ్యాహ్నం 3.30 గంటలకు తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్ సహా ఈ కేసులో సాక్షులుగా ఉన్న దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, బాల్క సుమన్, మాజీ మంత్రి జగదీష్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు నాంపల్లి కోర్టుకు బయలుదేరారు. కేటీఆర్, దాసోజు శ్రవణ్ ల వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసుకుంది.

# నీ తాటాకు చప్పుళ్లకు భయపడే వాళ్లం కాదు

(మొదటి పేజీ తరువాయి)

తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం అని అని బండి సంజయ్ పేర్కొన్నారు.

తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్రమంత్రి బండిసంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్ లీగల్ నోటీసుపై కేంద్రమంతి ఘాటైన జవాబిచ్చారు. తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటీసులా.. విమర్శలకు నోటీసులే సమాధానమా.. అయితే నీకు నోటీసులు పంపుతా... కాచుకో. నువ్వు సుద్దపూస అనుకుంటున్నవా.. నన్ను అవమానిస్తూ మాట్లాడితేనే బదులిచ్చిన మాటకు మాట...నోటీసుకు నోటీసుతోనే జవాబిస్తా అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూసినట్లు తెలిపారు. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు.

తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందని... స్పష్టం చేశారు. తనపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే అని చెప్పుకొచ్చారు. అందుకు బదులుగానే మాట్లాడినట్లు తెలిపారు.కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని .. వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరించారు. అక్టోబర్ 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ తన నోటీసుల్లో పేర్కొన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటానని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డానని నిరాధారణ ఆరోపణలు చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా కేంద్రమంత్రి ప్రస్తావరించారని నోటీసుల్లో పేర్కొన్నారు.

# డ్యామ్ సేఫ్టీపై కమిషన్ ప్రశ్నల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని నాగేందర్‌ను క్వశ్చన్ చేసింది. పరిమితికి మించి మ్యారేజీలలో నీళ్లను స్టోర్ చేయమని ఎవరు ఆదేశించారని కమిషన్ అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించింది. రామగుండం ఈఎన్‌సీ నిబంధనలు పాటించ లేదని కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పినట్లు తెలుస్తోంది. రామగుండం ఈఎన్‌సీ స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదన్నట్లుగా కమిషన్ ముందు చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా అని కమిషన్ ప్రశ్నించగా.. 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకమైన సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు. ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్‌పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సీ తీసుకోలేదన్నారు. ఓ అండ్ ఎం ఇన్స్పెక్షన్ రిపోర్టును కమిషన్‌కు ఈఎన్‌సీ నాగేందర్ సబ్మిట్ చేశారు. సీడబ్ల్యూసీ మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారని కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఫాలో చేయలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించారని అధికారులను కాళేశ్వరం కమిషన్ అడిగింది. నిర్మాణ సంస్థలు అగ్రిమెంట్ ఆపరేషన్స్ ప్రోటోకాల్ డ్యామ్ సేఫ్టీ ఆక్ట్ ఫాలో అయ్యారా అన్న ప్రశ్నకు కాలేదని నాగేందర్ సమాధానం చెప్పారు. వెథర్స్ షెడ్యూల్ ఫాలో అయ్యారా అని ప్రశ్నించగా.. దానికి కూడా కాలేదనే ఈఎన్సీ సమాధానం చేశారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా అని కమిషన్ ప్రశ్నించగా.. 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేసినట్లు కమిషన్ ముందు నాగేందర్ వెల్లడించారు.

ప్రమాదం జరిగే ముందు ఓ అండ్ ఎం పరిశీలన చేశారా అని.. బ్యారేజీలలో నీళ్లను నిలువ చేయాలని ఎవరు? ఆదేశించారంటూ కమిషన్ అడిగిన క్వశ్చన్‌కు... రామగుండం ఈఎన్సీకి మౌకిక ఆదేశాలు ఉన్నాయి అన్నట్లుగా కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పుకొచ్చారు.

## 28 నుంచి నవంబర్ 13 వరకూ
# బీసీ కులగణన

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చారు. బీసీల పిల్లలు ఐఐటీ, ఐఐఎంలో చదువుతున్నారు. అందరూ కులగణనను వినియోగించుకోవాలి. వివరాలు ఇవ్వడం ద్వారా పంచాయతీ, మేయర్ ఎన్నికల్లో అందరికీ అవకాశం ఉంటుంది. ప్రధాని మోదీ పదేళ్ల నుంచి అధికారంలో ఉన్నారు. కానీ ఆయన ఇంతవరకూ కులగణన చేయలేదు. గణన జరిగితే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ వస్తుంది' అని చెప్పారు. మరోవైపు బీసీ కులగుణనపై తెలంగాణ హైకోర్టు సెప్టెంబరు 10న కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల్లో కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీసీ కులగణనపై బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ వేసిన పిటిషన్‌పై హైకోర్టులో సెప్టెంబర్ 10న వాదోపవాదాలు జరిగాయి. ఈ మేరకు హైకోర్టు తీర్పు వెలువరించింది. అయితే కులగణన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 28 నుంచి కులగణన ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది.

## సరిహద్దు గస్తీ ఇరు దేశాల మధ్య ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం ఇరు దేశాల ప్రాధాన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల తర్వాత అధికారికంగా సమావేశం అవుతున్నాం. భారత్-చైనా సంబంధాలు ఇరు దేశాల ప్రజలకే కాకుండా ప్రపంచ శాంతి, సుస్థిరత, పురోగతికి ఎంతో ముఖ్యమని విశ్వసిస్తున్నాం. గత నాలుగేళ్లుగా సరిహద్దులో తలెత్తిన సమస్యలపై ఇటీవల వచ్చిన ఏకాభిప్రాయాన్ని స్వాగ తిస్తున్నాం. సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడుకోవడం మన ప్రాధాన్యంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం అనేవి మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ఐదేళ్లలో మోదీ-జిన్‌పింగ్‌లు అధికారికంగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ కీలక గస్తీ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో వీరి భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## వయనాడ్ ప్రజలు
# తన కుటుంబ సభ్యులే

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ తెలిపారు. ప్రియాంకగాంధీ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలే ప్రియాంక కుటుంబమన్నారు. ఆ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలకు తన సోదరిని అప్పగిస్తున్నానని, ప్రియాంక గాంధీని ఇక్కడి ప్రజలే రక్షించుకోవాలన్నారు. అనధికార ఎంపీగా తాను కూడా తరచూ వయనాడ్‌కు వస్తుంటానని రాహుల్ గాంధీ తెలిపారు. వయనాడ్ సభలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. వయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తుండగా.. లెఫ్ట్



డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) నుంచి సీపీఐకి చెందిన సత్యన్ మొకేరి, బీజేపీ నుంచి నవ్య హరిదాస్ పోటీ చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ తన రాజకీయ అనుభవం ఆధారంగా ప్రియాంక గాంధీకి సవాలు విసిరారు. సింగపూర్, నెదర్లాండ్స్‌లో పనిచేసిన నవ్య కోజికోడ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ నామినేషన్ దాఖలు చేయడానికి ముందు వయనాడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర సీనియర్ నేతలు పాల్గొనగా.. ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ప్రియాంక, రాహుల్ ముందుకుసాగారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ర్యాలీలో రాహుల్, ప్రియాంక ఉత్సాహంగా కనిపించారు. మధ్యలో కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారు. అలాగే రాహుల్, ప్రియాంక తన ర్యాలీ దృశ్యాలను స్వయంగా ఫోన్‌లో చిత్రీకరించారు. ర్యాలీకి ముందు పార్టీ నాయకుల సమక్షంలో ప్రియాంక గాంధీ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ర్యాలీ తర్వాత పార్టీ కార్యకర్తలు, అభిమానుల ను ఉద్దేశించి ప్రియాంక గాంధీ ప్రసంగించారు. వయనాడ్ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఇక్కడి నుంచి పోటీచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం జరిగినా ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం మాత్రమే నిర్వహించారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆమె ఇక్కడి నుంచి పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయబరేలీ స్థానాల నుంచి పోటీచేయగా.. రెండు చోట్ల విజయం సాధించారు. దీంతో వయనాడ్ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో వయనాడ్ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్13న ఇక్కడ పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రియాంక గాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రియాంక గాంధీ ఎంపీగా గెలిస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక కలిసి పార్లమెంటులో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది.

# పాక్‌తో సయోధ్యకు కృషి చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ, ఇరుదేశాల శత్రుత్వం మధ్య జమ్మూకశ్మీర్ ప్రజలు చిక్కుకుపోయారని అన్నారు. రెండు దేశాల శత్రుత్వం మధ్య జమ్మూకశ్మీర్ ప్రజలు చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. వారి ప్రాణాలు, ఆస్తులు, ప్రతీదీ కోల్పోతూ బాధితులుగా మారు తున్నారు. మన పేద కార్మికులు సైతం బాధితులవు తున్నారు. డాక్టర్ షానవాజ్ కూడా ఈ తరహా బాధితుడే' అని మెహబూబా ముఫ్తీ అన్నారు.

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి చేసినట్టుగానే ఇరుదేశాలు కలిసి కూర్చుని సయోధ్య సాధించడం ఒక్కటే మార్గమని, అలాకాకుంటే ఇలాంటి దాడులు కొనసాగుతూనే ఉంటాయని మాజీ సీఎం అన్నారు. రెండు దేశాల మధ్య యుద్ధం కొనసాగినంత కాలం జమ్మూకశ్మీర్ ప్రజలు బాధితులుగానే మిగిలిపోతారన్నారు. ముఫ్తీ మాత్రమే కాదు...జమ్మూకశ్మీర్‌లోని ప్రతి ఒక్కరూ ఈ యుద్ధానికి తెరపడాలని కోరుకుంటున్నారని అన్నారు. రెండు దేశాలు మాట్లాడుకుని జమ్మూకశ్మీర్‌ను రక్తపాతం చెర నుంచి విడిపించాలని సూచించారు. దీనికి ముందు, డాక్టర్ షానవాజ్ దర్ కుటుంబ సభ్యులను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సైతం పరామర్శించారు. గందేర్‌బల్‌లోని టన్నెల్ నిర్మాల కార్మికులపై గత ఆదివారంనాడు ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో నలుగురు, డాక్టర్ షానవాజ్ తీవ్రమైన గాయాలతో చికిత్సపొందుతూ మరణించారు.

# ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అరెస్టులా..

### మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్‌రావు

హైదరాబాద్,(నమస్తే ఉదయం): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్మించ తలపెట్టిన అదానీ- అంబుజా సిమెంట్ పరిశ్రమపై నిర్వహిస్తున్న ప్రజాభి ప్రాయ సేకరణకు భారాస నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు.

నల్గొండ జిల్లాలో భారాస నాయకులను అరెస్టు చేయడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను, నిర్బంధాల మధ్య నిర్వహించడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజాపాలన అంటూ నిర్బంధ పాలన కొనసాగించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు.

అక్రమంగా అరెస్టులు చేసిన భారాస నాయకులు, ప్రజా సంఘాల నేతలు, పర్యావరణవేత్తలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## కేంద్రమంత్రి బండి సంజయ్‌కి
# కేటీఆర్ లీగల్ నోటీసు!

మొదటి పేజీ తరువాయి..

హెచ్చరించారు. ఈ నెల 19 వ తేదీన బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరో పణలు చేశారని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుం టారని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ చేసిన నిరాధరమైన కామెంట్లను నోటీసులో పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా తీశారని చెప్పారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమాన పరిచేలా, ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నా యని నోటీసులో తెలిపారు. కేవలం తనను అప్రతిష్ఠ పాలు చేయాలన్న దురు ద్దేశతంతోనే బండి సంజయ్ వ్యాఖ్యలు ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటానని, ఫోన్ ట్యాపింగ్ చేశానని, కేసుల నుంచి తప్పించు కోవటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరూపిం చాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టాను సారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయబడ్డాయని దీని కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకొని ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. వాటిన్నింటిని ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కొట్టిపారేశారు.

కేంద్ర మంత్రిగా బాధ్యతయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశం, తమ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ నోటీసులో తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, 9 ఏళ్లు రాష్ట్ర మంత్రి గా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని చెప్పారు.

గతంలోనూ బండి సంజయ్ తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే తన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం కొన్నేళ్ళుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఇలాంటి ఆరోపణలు చేయటం ద్వారా ప్రజల్లో తన ప్రతిష్టను నాశనం చేయాలనే కుట్ర తప్ప వారి ఆరోపణల్లో నిజం లేదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించు కోవాలని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు.

అసత్య ప్రచారం చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా క్షమాపణలు చెప్పకుంటే పరువు నష్టం దావా, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కొవాల్సి వస్తుందని కేటీఆర్ లీగల్ నోటీసులో హెచ్చరించారు.

## ఒకట్రెండు రోజుల్లో పొలిటికల్ బాంబులు పేలతాయి!

(మొదటి పేజీ తరువాయి)

సియోల్ నుంచి హైదరాబాద్ చేరేలోపే ఈ చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ఇది కక్ష్యసాధింపు కాదని.. పూర్తి ఆధారాలతో సర్కారు చర్యలు తీసుకోబోతోందని స్పష్టం చేశారు. తప్పు చేసింది ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విచారణ దాదాపు పూర్తయిందని, మొత్తానికి ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ధరణి అంశాలు ట్రాక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఎలాంటి చర్యలు లేవని ప్రజలు భావించవద్దని, వారు కోరుకునే విధంగా పూర్తి ఆధారాలతో ముందుకు రాబోతున్నామని వెల్లడించారు.

### అన్ని భూ సమస్యలకు చెక్ పెట్టేలా..

భూహక్కులపై సామాన్య రైతుల నుంచి భూస్వాముల వరకు ఎవరికి అపోహలకు తావు లేకుండా అన్ని సమస్యలకు చెక్‌పెట్టేలా కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కొత్త ఆర్వోఆర్ చట్టం ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. అభద్రతలో ఉన్న లక్షలాది మంది రైతులకు ఇందిరమ్మ ప్రభుత్వం భరోసా కల్పించబోతోందని స్పష్టం చేశారు. 15 దేశాల్లో అమల్లో ఉన్న ఉత్తమ రెవెన్యూ విధానాలను అధ్యయనం చేసి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించామన్నారు. అంతేకాకుండా ముసాయిదాపై సామాన్య రైతులు, మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరించి వారి సూచనలు, సలహాలను క్రోడీకరించి చట్టంలో పొందుపర్చామని వెల్లడించారు.

ధరణి లోపాల వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. లక్షలాది ఎకరాల భూరికార్డులను విదేశీ సంస్థల చేతిలో పెట్టిన కేసీఆర్.. పోర్టల్ నిర్వహణ పేరుతో రూ.కోట్ల ఖర్చు చేశారని ఆరోపించారు. పార్ట్-బీలో ఉన్న 13 లక్షల ఎకరాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడంతోపాటు ధరణిలో కనిపించకుండా ఉన్న భూములను బయటపెట్టి అర్హులకు, హక్కుదారులకు దక్కేలా చూస్తామని చెప్పారు. గతంలో మాన్యువల్‌గా ఉన్న పహాణీలో 32 కాలాలు ఉండేవని అవన్నీ గత ప్రభుత్వం తొలగించి ధరణి ముసుగులో ఒకే కాలం పెట్టి గందరగోళ పరిస్థితిని సృష్టించిందన్నారు. ఇదే కాలంలో మార్పులు చేసి సుమారు 14 కాలాలు ఉండేలా ధరణి పేరు మార్చి కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తేబోతున్నామన్నారు. ప్రతి రైతుకు క్లియర్ టైటిల్‌తో డాక్యుమెంట్ ఉండబోతోందని వివరించారు.

## గంగారెడ్డి హత్యపై ప్రభుత్వం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయిన బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి కంటే ముందే మా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంది. గంగారెడ్డి హత్యకు నాకు సంబంధం లేదని ఎమ్మెల్యే సంజయ్ స్పష్టం చేశారు. వేరే కారణాలతోనే గంగారెడ్డి హత్య జరిగిందన్నారు. గంగారెడ్డి హత్యతో కొందరు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. తాను జగిత్యాల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. గంగారెడ్డి హత్యపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాల్సిందే అని ఎమ్మెల్యే సంజయ్ పేర్కొన్నారు. మరోవైపు ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్యతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గంగారెడ్డి హత్యకు నిరసనగా జగిత్యాలలో నిరసనలు కూడా చేపట్టారు. ఒకనొక సమయంలో పార్టీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు జీవన్ రెడ్డి. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడే సమయంలోనూ ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ మంచి బహుమతి ఇచ్చింది. పార్టీలో కొనసాగడం సాధ్యం కాదు. ఇంతకాలం మానసికంగా అవమానాలకు గురైనా భరించా. ఇప్పుడు భౌతిక దాడులకు పాల్పడుతురు. దయచేసి నన్ను క్షమించండి అన్నా అంటూ జీవన్ రెడ్డి ఫోన్ కట్ చేశారు. అంతేకాకుండా... మీ పార్టీకి.. మీకు ఓ దండం.. మీ పార్టీలో నేను ఇక ఉండను.. ఇక నైనా బతక నివ్వండి అంటూ విప్ లక్ష్మణ్ కుమార్‌తో వ్యాఖ్యలు చేశారు.అయితే గంగారెడ్డి హత్యతో జగిత్యాల జిల్లాలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. హత్యకు నిరసనగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిరసనకు దిగారు. జగిత్యాలలోని పాత బస్టాండ్ ఆవరణలో నడి రోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కూడా జీవన్‌రెడ్డితో కలిసి ఆందోళనకు

దిగారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఎమ్మెల్సీ ధర్నా చేశారు. మరోవైపు గంగారెడ్డిని హత్య చేసిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అలాగే నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కాల్ డేటా, వాట్సాప్ డేటాను పరిశీలిస్తున్నారు. అలాగే పోలీసులతో నిందితుడికి సంబంధాలపై విచారణ కొనసాగుతోంది.

## ఐద్వా రాష్ట్ర 4వ మహా సభలో నూతన రాష్ట్ర కమిటీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** ఈనెల 21, 22, 23 తేదీలలోభద్రాద్రి కొత్తగూడెంజిల్లా, కొత్తగూడెం లో జరుగు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభ లలో రాష్ట్ర నూతన కమిటీ ఎనుకోవడం జరిగింది.



ఈ సందర్భంగా ఐద్వా గద్వాలజిల్లా కార్యదర్శి ఏ నర్మద ను రాష్ట్ర నూతన కమిటీకి ఎనుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రనూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మహాసభల్లో గద్వాల జిల్లా ఐద్వా నిర్మాణం, గద్వాల జిల్లాలో మహిళా సమస్యలపై రిపోర్ట్‌ను ప్రవేశ పెటింది. గద్వాల జిల్లాలో మహిళాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల ద్వారా పరిష్కారించడం జరిగిందన్నారు. భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని మహిళా హక్కుల రక్షణకై పోరాడుతు సంఘము బలోపేతనికి కృషి చేస్తామని అన్నారు.

## స్కూల్ విద్యార్థులకు బ్యాగులు పంపిణి

**గద్వాల, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** జన్ సహాస్ , ఆశ్రయ ఫౌండేషన్ గ్రీన్ సోల్ సౌజన్యంతో ఎల్లబండ తండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్రేనీ ఐఏఎస్ చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, రీడింగ్



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మ్యాట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ రమేష్, ఆశ్రయ ఫౌండేషన్ సభ్యులు ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతు అవగాహన సదస్సును జయప్రదం చేయండి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి నారాయణ**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** ఈనెల 26న నిర్వహించే రైతు అవగాహన సదస్సుకు సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున రైతులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి నారాయణ ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ తన



సమీక్షా సమావేశంలో సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

ఛాంబర్ లో రైతు అవగాహన సదస్సు ఏర్పాట్లపై పంచాయతీ, వ్యవసాయ, హార్టికల్చర్, డి.ఆర్.డి.ఏ.అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 26న రైతు అవగాహన సదస్సును అధికారులు సమన్వయంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గద్వాల రైతు సదస్సు శనివారం 26వ తేదీ ఉదయం 9:00 నుండి సాయంత్రం 6:00 వరకు గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ (గంజి)లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రైతులను సదస్సుకు పెద్ద ఎత్తున తరలించేందుకు జిల్లా పంచాయతీ అధికారి, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, డి.ఆర్.డి.ఓ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు సంబంధించిన ప్రత్యేకమైన స్టాళ్లు కూడా ఏర్పాటు చేయాలని, ఈ సదస్సులో ప్రధానంగా రైతులకు ఉద్యానవనంపై అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి శ్యామ్ సుందర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఏడీఏ లు, ఏపీయం, డిపియం తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదిరెడ్డి గృహప్రవేశానికి హాజరైన యువ నేత కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదిరెడ్డి నూతన గృహప్రవేశానికి బిఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో టిఆర్ఎస్‌కు పటిష్టమైన నాయకత్వాన్ని ఏర్పాటు



చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్, నాయకులు మైసిరెడ్డి, అరుణ్ ముదిరాజ్ , రాఘవేందర్ యాదవ్, వెంకటరమణ ,మహేష్ గౌడ్, ఎల్ రాజు, అంజి, శ్రీకాంత్ రెడ్డి ,కార్తీక్, అశోక్ కుమార్ నాయుడు, క్రాంతి, భాస్కర్, రాజు, ధనుంజయ, పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లోని వరి పొలాలను పరిశీలిస్తున్న రాష్ట్ర విత్తనాభి వృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి,



మాట్లాడుతున్న డాక్టర్ మీనాక్షి రామన్ సుందరం

# ఐఐఆర్ఆర్‌లో ఇండస్ట్రీ మీట్

**రాజేంద్రనగర్, అక్టోబరు23 (నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్‌లోని భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) లో బుధవారం నిర్వహించిన "ఇండస్ట్రీ మీట్ - 2024" లో తెలంగాణ రాష్ట్ర విత్తానాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విత్తన ప్రాముఖ్యత, రైతులకు కావలసిన విత్తనాల రకాలు, ప్రస్తుతం రైతాంగం ఎదుర్కుంటున్న నాణ్యమైన విత్తనాల లభ్యత గురించి తెలియజేయడం జరిగింది. వ్యవసాయంలో విత్తనమే ప్రధానమైనదని, విత్తనం నాణ్యత లేకపోతే రైతు నష్టపోతాడని కాబట్టి విత్తన ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

వరిలో - అధిక దిగుబడి, రోగాలను తట్టుకునే శక్తి, పంట నాణ్యత, పోషకాల లభ్యత, మిల్లింగ్ క్వాలిటీ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని వరి రకాల పరిశోధన నిర్వహించాల్సింది గా కోరారు. ప్రభుత్వ సంస్థలు ఎంతో శ్రమించి అధిక దిగుబడులు ఇచ్చే రకాలను అభివృద్ధి చేస్తే, వాటిని ప్రైవేట్ కంపెనీలు నాణ్యత పాటించకుండా మార్కెట్ లో వేరే వేరే పేర్లతో, పలు ప్రైవేట్ రకాలను ఈ అధిక దిగుబడినిచ్చే రకాల పేర్లతో రైతులకు అంటగడ్తున్నారన్నారు. వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. భారత వరి పరిశోధన సంస్థ అభివృద్ధి చేసిన కొత్త రకాల విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థకు అందించినచో వాటిని ఉత్పత్తి చేసి రాష్ట్ర రైతాంగానికి అందించగలమన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న ఐఐఆర్ఆర్ డైరెక్టర్ మీనాక్షి రామన్ సుందరం దక్షిణ భారత రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవేందర్ రెడ్డి , శాస్త్రవేత్తలు, రైస్ మిల్లర్లు, సీడ్ కంపెనీలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

## రుణమాఫీ కాని రైతుల వివరాలను కలెక్టర్ సంతోష్‌కి నివేదిస్తాం

**- నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన అనగా శుక్రవారం రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ రెండు లక్షల రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్ సంతోష్ కి సమర్పిస్తున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఒకవైపు ప్రభుత్వం రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని మభ్యపెడుతున్నా, వాస్తవానికి గ్రామాలలో కనీసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల లోపు ఇంతవరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, ఏవైతే చిన్న చిన్న కారణాలు చెబుతున్నారో బ్యాంకర్ లతో సమావేశం ఏర్పాటు చేసి వాటిని పరిష్కారం చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దసరా లోపు ఇస్తామన్న రైతు భరోసా ఊసే లేదని రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. గ్రామాలలో జిల్లా వ్యాప్తంగా రైతు రుణమాఫీ కాని రైతులు వారి భూమి యొక్క పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఈ వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్ సంతోష్ కి సమర్పిస్తామని అన్నారు.కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు పట్టణ నాయకులు గౌని శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి లవన్న, జిల్లా నాయకులు వెంకట్రాములు మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు నాయుడు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్,మండల కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.



లాడ్జిలో డాగ్స్‌తో తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు



కొత్తకోట బస్టాండ్‌లో డాగ్స్‌తో తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

## కొత్తకోట పట్టణంలో డాగ్స్ తనిఖీలు

**కొత్తకోట, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం సాయంత్రం వనపర్తి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నార్కోటిక్ డ్రగ్స్ ని గుర్తించడానికి స్పెషల్ గా ట్రైనింగ్ పొందిన డాగ్స్ తో బీడీ టీం సిబ్బంది కొత్తకోట బస్టాండు, భద్రప కాంప్లెక్స్, మదనాపురం రోడ్డు, మహేశ్వరి లాడ్జ బిల్డింగ్ (శివ పద్మ కాంప్లెక్స్) తదితర పరిసరాలను ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కురుమయ్య గౌడ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, బీడీ టీం సిబ్బంది శ్రీనివాసులు, శివ, రాంబాబు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీస్ చట్టాలపై అవగాహన

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఒపెన్ హౌస్ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో బాగంగా జిల్లా కేంద్రంలోనీ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో 21వ తేది ఏర్పాటు ఒపెన్ హౌస్ స్టాల్స్ జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు బుధవారం అలంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలంపూర్ ఎక్స్ రోడ్‌లోని విశ్వ శాంతి హై స్కూల్, గద్వాల్ పట్టణంలోని సంస్కార్ స్కూల్, ఎర్రవల్లిలోని సరస్వతి ఇంటర్ నేషనల్ స్కూల్, ధర్మారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లకు చెందినవిద్యార్థులు సందర్శించారు.

అందులో భాగంగా విద్యార్థిని,విద్యార్థులకు పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆయుధాలు,బాంబు డిస్పోజల్ సామాగ్రి,పోలీస్ జాగిలాల ప్రదర్శనతో పాటు వాటి వినియోగం గురించి కూడా వివరించడం జరిగింది. అలగే షి టీమ్, ట్రాఫిక్, సైబర్ క్రైమ్, ఆంటీ నార్కోటిక్ డ్రగ్ విభాగాల పని తీరు పై అవగాహన కల్పించడం జరిగింది. పోలీస్ ప్రజలకు అందిస్తున్న సేవలు, అత్యవసర సమయాలలో విద్యార్థులు వినియోగించాల్సిన డయల్ -100, షి టీమ్ నెంబర్ 8712670312 గురించి వివరించారు.

అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోకి విద్యార్థులను ఆహ్వానించి వివిధ విభాగాలను విద్యార్థులకు చూపించి అక్కడ జరిగే పని తీరును వివరించడం జరిగింది.

ఈ సందర్భంగా కార్యాలయ ఏ.ఓ.సతీశ్ కుమార్ మాట్లాడుతూ... పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ చేస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా పోలీస్ శాఖ పనితీరు ప్రజలకు, విద్యార్థినీ, విద్యార్థులకు తెలిసే విధంగా ప్రదర్శన చూపించడం జరుగుతుందన్నారు. జిల్లా పోలీస్ వ్యవస్థ మానిటరింగ్ ప్రధాన కార్యాలయం



విద్యార్థులకు పోలీస్ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నుండి జరిగే విధానాలు విద్యార్థులకు వివరించారు. ఒక్కొక్క విభాగంలో సిబ్బంది చేసే విధులు, పోలీస్ స్టేషన్ లకు అందించే కమ్యూనికేషన్ సిస్టమ్ పనితీరు, సర్వీస్ రికార్డ్స్, రివార్డ్స్ మెంటనేన్స్ చెసే విధానం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో Zphs స్కూల్ ఆలంపూర్, విశ్వ శాంతి హై స్కూల్ ఆలంపూర్ x రోడ్డు, సంస్కార్ స్కూల్ - గద్వాల్, సరస్వతి ఇంటర్ నేషనల్ స్కూల్ - ఎర్రవల్లి, ZPHS ధర్మవరం పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఆర్ ఎస్సై లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .



బాల సంక్షేమ అధికారులకు హామీ పత్రం అందజేస్తున్న గొర్రెల యజమాని కర్రెప్ప

# ఆర్థిక స్తోమత లేని బాలుడికి విద్యాభివృద్ధికి తోడ్పాటు

**గద్వాల (కేటీదొడ్డి), అక్టోబర్ 23 (నమస్తే ఉదయం):** కేటీదొడ్డి గ్రామంలో ఆర్థిక స్తోమత లేని హెచ్ నరసింహులు కుమారుడు నవీన్ కు విద్యా అభ్యసించడానికి తన తండ్రి గొర్రెల కాపరిగా పాలేరుగా పెట్టిన బాలుడికి విద్యను అందించటానికి సదర్ యజమాని అంగీకరించారు. గ్రామానికి చెందిన కురువ కర్రెప్ప గొర్రెల కాపరిగా నవీన్ ను జీతం వున్నాడు. కర్రెప్ప నవీను 70 వేల రూపాయలకు సంవత్సరానికి గొర్రెల కాపరిగా జీతం పెట్టుకున్నాడు. అయితే నవీన్ విద్య పట్ల ఆసక్తి చూపటంతో తల్లిదండ్రులు, గొర్రెల యజమానిని కౌన్సిలింగ్ ఇవ్వటంతో సదరు నవీన్ కు చదువు చెప్పించటానికి అంగీకరించారు. నవీన్ చదువుకోటానికి తాను ఇచ్చిన 70వేలు సైతం అడగనని ముందుకు రావడంతో కుర్ర కర్రెప్పను జిల్లా బాల సంక్షేమ అధికారులు అభినందించారు. డబ్బులు నేను అడగను అని యజమానితో నోట్ రాయించడం జరిగింది. అనంతరం కేటీదొడ్డి మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి నవీన్ చదువుకు సంబంధించి విద్యా శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు .అదేవిదంగా యజమానుని హెచ్చరించి మండలంలో గొర్రెల కాపరిగా పని చేసే వారిని గుర్తించి మండలంలో బాల కార్మికులు లేని మండలం గా చేస్తామని చెప్పడం జరిగింది. సి డబ్ల్యూ సి ముందు హాజరు పరచడం జరిగింది. అనంతరం గద్వాల్ బాయ్స్ స్కూల్ లో 9వ తరగతిలో ప్రవేశం ఇప్పించారు. అనంతరం ఎస్ సి హాస్టల్ వాటర్ దగ్గర మాట్లాడి హాస్టల్ లో జాయిన్ చేయడం జరిగింది. యజమాని అబ్బాయి కి రెండు జతలు బట్టలు, చెప్పులు , నోట్ బుక్స్ అందజేశారు.

# యూపిలో ఆహార పదార్థాలపై ఉమ్మి

## కఠిన చర్యలకు దిగిన యోగి సర్కార్

**లక్నో,అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** ఉమ్మి వేస్తూ తందూరి రోటీలు తయారు చేస్తున్న దాబా ఓనర్ ఉదంతంపై తాజాగా యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. యూపీలో ఇలాంటి ఘటనలు ఎక్కువవుతుండటంతో అది యూపీ ప్రతిష్టను దెబ్బతీస్తుంది. తినే పదార్థాలను పాడు చేయడం, ఉమ్మి వేయడం వంటి ఘటనలు అధికంగా యూపీ నుంచే నమోదవుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు



ఉపక్రమించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆహారంలో ఉమ్మివేయడం లేదా ఉమ్మి కలిపిన ఆహారాన్ని వడ్డించడం వంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకునేలా కీలక సమావేశం నిర్వహించింది. ఇటువంటి హానికర కార్యకలాపాలను నిరోధించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్ ను తయారు చేయనుంది. ఉమ్మివేయడం నిషేధం ఆర్డినెన్స్ 2024' , 'యుపి ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ ఇన్ కాంటామినేషన్ (కన్స్యూమర్ రైట్ టు నో) ఆర్డినెన్స్ 2024' ను తీసుకురానుంది. సీఎం యోగి సంబంధిత అధికారులతో పాటు హోంశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్, ఆశిష్ సింగ్ (హోం శాఖ), సంజీవ్ గుప్తా తో సమావేశమయ్యారు. ఈ ఆర్డినెన్స్‌ల ద్వారా ఉమ్మివేసి తయారు చేసే ఆహారం సప్లై చేసేవారిపై కఠినమైన నిబంధనలను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో పాటు ప్రతి వినియోగదారుడు తన ఆహారం గురించి పూర్తి సమాచారాన్ని కలిగి ఉండేలా చేస్తుంది. అంటే ఆహారం ఎక్కడ తయారు చేయబడింది, ఎవరు తయారు చేస్తున్నారు మొదలైనవి తెలుసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. వైరలైన వీడియోలో దాబాలో పనిచేస్తున్న ఓ వ్యక్తి చకచకా తందూరి రోటీలు కాల్చుతూ కస్టమర్లకు అందిస్తున్నాడు. మధ్య మధ్యలో అందులో కాస్త ఉమ్మి దాన్ని కూడా పెనం మీద వేడి వేడిగా కాల్చి సప్లై చేసేస్తున్నాడు. పక్కన ఉన్న ఇంకో వ్యక్తి దీన్ని కళ్లారా చూస్తున్నా అతడిని వారించకపోగా ఇద్దరూ కలిసి పకపకా నవ్వుకుంటూ రాక్షసానందం పొందుతున్నారు.ఇదంతా దూరం నుంచి గమనిస్తున్న కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ గా మారింది.

# దూసుకొస్తున్న దానా తుఫాన్

## పలు రైళ్లు దారి మళ్లింపు

**భువనేశ్వర్,అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** 'దానా' తుపాను ప్రభావం నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే తాజాగా మరికొన్ని రైళ్లను రద్దు చేసింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు పేర్కొంది. 23, 24, 25, 26, 27, 29 తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తుపాను నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య కేంద్రాల్లో రైళ్ల రాకపోకల సమాచారం కోసం 17 నగరాలు/పట్టణాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 200 రైళ్ల సర్వీసులను రద్దు, దారిమళ్లించినట్లు సమాచారం. మరోవైపు, ఈ తుపానుతో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే 23వ తేదీ నుంచి 25 వరకు జరగాల్సిన పరీక్షలన్నింటినీ రద్దు చేసింది. ఈ నెల 27న జరగాల్సిన ఒడిశా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను సైతం వాయిదా వేశారు.



కొత్త తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, ఈ నెల 24, 25 తేదీల్లో నందన్‌కానన్ జూ, బొటానికల్ గాడర్గన్‌లకు సందర్శకులను అనుమతించరాదని నిర్ణయించారు. అలాగే, నేటి నుంచి ఈనెల 25 వరకు సిమిలిపాల్ టైగర్ రిజర్వ్, భితార్కనిక జాతీయ పార్కులను మూసివేస్తున్నట్లు తెలిపారు. తుపాను సమయంలో మూగ జీవాలకు ఆశ్రయం కల్పించాలని మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జంతువులు ఏవైనా గాయపడినట్లు గుర్తిస్తే.. 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

# మూసి బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం:శాసనసభ్యులు పాయల్ శంకర్

**బండ్లగూడ, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** మూసి బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం సాగిస్తామని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో మూసి పరివాహక ప్రాంతంలోని బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ, విఘ్నేశ్వర కాలనీ, హైదర్షా కోట్ కేంద్రవిహార్ , సాయిరాం నగర్, లో నివసిస్తున్న ప్రజల ఇండ్లను కూల్చివేస్తామంటూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నారు.

ఈ పరివాహక ప్రాంత ప్రజలకు భారతీయ జనతా పార్టీ నాయకులం మీ వెంట ఉన్నామనీ, మీకు న్యాయం జరిగే వరకు మేం పోరాడుతామని వారికి భరోసా కల్పించుట శాసనసభ్యులు పాయల్ శంకర్, తెలంగాణ బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కాంటెస్టెడ్ అభ్యర్థి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బిజెపి రాష్ట్ర నాయకుడు బొక్క బాల్ రెడ్డి, భీమ అర్జున్ రెడ్డి, జిల్లా నాయకులు కొమురయ్య, మహాలింగం గౌడ్, లక్ష్మీనారాయణ రెడ్డి, మల్లారెడ్డి ,మహేష్ యాదవ్, రాజేందర్ నగర్ అసెంబ్లీ బిజెపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.




మూసి బాధితులకు అండగా బిజెపి నాయకులు



# టీఎన్జీవోస్ కాలనీ - లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ మధ్య ఉన్న స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

## మైలార్ దేవ్‌పల్లి సర్వే నెంబర్ 156 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**రాజేంద్రనగర్, అక్టోబరు23(నమస్తే ఉదయం) :** మైలార్ దేవుపల్లి సర్వేనెంబర్ 156 లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలను బుధవారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి ఆదేశాల మేరకు తహసిల్దార్ బి రాములు పర్యవేక్షణలో పర్యవేక్షణలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీతా రెడ్డి సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ప్రహరీ గోడను కూల్చివేస్తున్న ఎస్కవలేటర్ పై రాళ్లతో కొట్టిన రవీందర్ రెడ్డి అనే వ్యక్తిపై రెవెన్యూ అధికారులు మైలార్ దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించేది లేదు : తహసీల్దార్ బి. రాములు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని తహసిల్దార్ బి. రాములు అన్నారు. మైలార్ దేవ్ పల్లి సర్వే నెంబర్ 156 లో 433.17 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాంట్లో వివిధ సంస్థలకు భూములు కేటాయించగా, మిగిలిన భూమి ని కొందరు ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ఎస్కవలేటర్‌పై రాళ్ళతో కొడుతున్న స్థానికులు

# వైద్యాధికారుల నియామకానికి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** గద్వాల జిల్లా ఆసుపత్రి, సి.హెచ్.సి అలంపూర్‌లలో వైద్యాధి కారుల నియామకానికి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా ఆసుపత్రి జోగులాంబ గద్వాల్,



సి.హెచ్.సి అలంపూర్‌లో CAS (SPL) జనరల్ మెడిసిన్ (3), CAS (SPL) జనరల్ సర్జన్ (2), CAS (SPL) గైనకోలోజిస్ట్ (4), CAS (SPL) అనస్థేషియా(2), అలంపూర్‌లో జి.డి.యం.ఓ (2) పోస్టుల భర్తీ కొరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించబడు తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 25 నుండి 26 వరకు రెండు రోజుల పాటు నిర్వహించబడే ఈ ఇంటర్వ్యూలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. ఎంపిక ప్రక్రియ గద్వాల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్‌లో జరుగుతుందని తెలిపారు.

# నవంబర్ 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

## - జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ వెల్లడి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 08న ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు విచ్చేయనుందని కలెక్టర్ బి.యం .సంతోష్ తెలిపారు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్,08 న మహబూబ్ నగర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్




నేతృత్వంలోని సభ్యులు బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. తమ తమ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలను నిర్దేశిత నమూనాలో తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్ కు నివేదించవచ్చని కలెక్టర్ సూచించారు.

# ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచం ఏకతాటిపై నిలవాలి

## ద్వంద్వ ప్రమాణాలు మంచివి కావు

## పరోక్షంగా చైనాను ఉద్దేశించి మోడీ వ్యాఖ్యలు

**మాస్కో,అక్టోబర్ 23(నమస్తే ఉదయం):** ఉగ్రవాదంపై పోరుకు యావత్ ప్రపంచం ఏకతాటిపై నిలవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యూఎన్ కాంప్రహెన్సివ్ కన్వెన్షన్‌లో ప్రస్తావించిన పెండింగ్ అంశాలపై కూడా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యదేశాలకు మోదీ పిలుపునిచ్చారు. సైబర్ సెక్యూరిటీ అనేది కీలకమని, సైబర్ సెక్యూరిటీ, సేఫ్, సెక్యూర్ ఏఐపై అంతర్జాతీయ రెగ్యులేషన్సపై సభ్యదేశాలు కలిసకట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, డబ్ల్యూటీఓ వంటి గ్లోబల్ సంస్థల్లో




పిలుపునిచ్చారు. దీనిపై ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదని పరోక్షంగా చైనా తీరును ఎండగట్టారు. కజాన్‌లో జరుగుతున్న 16వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం అనే తీవ్ర సమస్యను కలిసికట్టుగానే ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇలాంటి అంశాల్లో ద్వంద్వ ప్రమాణాలు సరికాదన్నారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులకు నిధుల సరఫరా అనేవి చాలా తీవ్రమైన సమస్యలు. వీటిని చాలా సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర నేరుగా ఏ దేశం పేరును ప్రస్తావించకపోయినప్పటికీ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు చైనా ఆర్థిక సహాయాన్ని ఎండగట్టారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే రాడికలైజేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు.

యువతను అతివాదులుగా మారేందుకు ప్రేరేపించడాన్ని సమష్టిగా ప్రపంచ దేశాలు అడ్డుకోవాలని అన్నారు. అంతర్జాతీయ తీవ్ర వాదంపై కూడా ఎప్పటికప్పుడు సంస్కరణలు తెచ్చేందుకు ముందుకు రావాలని సూచించారు. చర్చలు, దౌత్యానికి భారత్ బాసటగా నిలుస్తుందని, యుద్ధానికి కాదని ప్రధాని మరోసారి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆహారం, నీరు, ఇంధనం, ఆరోగ్యం వంటి అంశాలు అన్ని దేశాలకు ప్రాధాన్యతాంశాలని అన్నారు. 'బ్రిక్స్' అంటే విభజన గ్రూప్ కాదని, పబ్లిక్ ఇంట్రస్ట్ గ్రూప్ అనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు మనం ఇవ్వాలని అన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య దేశంగా కొత్త కొత్తదేశాలకు స్వాగతం పలికేందుకు ఇండియా సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. అయితే ఇందుకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిక్స్ వ్యవస్థాపక దేశాల అభిప్రాయాలను గౌరవించాల్సి ఉంటుందన్నారు. జోహెన్సెస్‌బర్గ్ సమ్మిట్‌లో అంగీకరించిన సిద్ధాంతాలు, ప్రమాణాలు, క్రైటీరియా, ప్రొసీజర్‌ను తూచ తప్పకుండా సభ్యదేశాలు పాటిస్తూ ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733